నేడు మిట్స్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

చిలుకూరు, జనవరి 31: మండల పరిధిలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. సినర్జమ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 7 మల్టీ నేషనల్ కంపెనీలు 465 ఉద్యోగాలకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని కళాశాలలకు చెందిన ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు హాజరు కావొచ్చని వెల్లడించారు.

'పదవి విరమణ వయస్సు పెంపుతో నిరుద్యోగులకు నష్టం'

జీఓ ప్రతులను దహనం చేస్తున్న తెలంగాణ యువజన సంఘం నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధ్యాపకుల పదవి విరమణ వయస్సును 60 నుంచి 65కి పెంచడంతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. పదవీ విరమణ వయస్సును పెంచుతూ విడుదల చేసిన జీఓ ప్రతులను శుక్రవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయం నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టడమేనని మండిపడ్డారు. వయస్సు పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థు, నిరుద్యోగులు మరో పోరాటం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాషిపంగు సునీల్, విప్లవ్‌కుమార్, పంతం యాకయ్య, దారాపత్ వెంకటేశ్‌నాయక్, కోడి సురేశ్, కొలికపంగు వాసు, చామకూరి మహేందర్, రాహుల్, శ్యామ్, రోషిబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు : సీపీఎం

సూర్యాపేట టౌన్, జనవరి 31: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్మిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రామికుల దోపిడీ, సామాజిక అణచివేత, సరళీకృత ఆర్థిక విధానాలపై బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి చేతులు దులుపుకొన్నదని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ధరలను నియంత్రించాలని, బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని, ఎస్సీ వర్గీకరణ చేయాలని అన్నారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతుల పంట పొలాలను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముల్కలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

'విశ్రాంత ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి'

పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

నేరేడుచర్ల, జనవరి 31: విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నేరేడుచర్లలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో పెన్షనర్ల ఆరాధ్యుడు నకారా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. హెల్త్‌కార్డులు లేకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు లక్షల రూపాయలు వెచ్చించి వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, వీరభద్రరావు, పూర్ణచంద్రారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఉద్యమం

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

మిర్యాలగూడ, జనవరి 31: రాష్ట్రంలో బీసీలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంతో స్థానిక సంస్థల్లో పోటీ చేసే బీసీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు దాస రాజు జయరాజు, సిద్ధం రాజు, అంజి గౌడ్, గంగాధర్, భాస్కర్, ఉపేందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో నైపుణ్యం సాధిస్తే ఉత్తమ అవకాశాలు

రామగిరి, జనవరి 31: ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు తమ బ్రాంచ్‌లో నైపుణ్యం సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూర్ అధ్యాపకుడు గోపాల్ హెగ్డే సూచించారు. ఎంజీయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం 'ఇంజినీరింగ్‌లో ఉపాధి అవకాశాలు' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

నల్లగొండ రూరల్, జనవరి 31: అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు శుక్రవారం టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు అందించిన హెల్త్‌కార్డులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఏచూరి భాస్కర్, కొటగిరి దైవాదీనం, గుండగోని జయశంకర్, పులిమామిడి మహేందర్ రెడ్డి, గాదే రమేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, Thatikonda Srinivas Reddy, S/o. Thatikonda Venkat Reddy, R/o. H.No.2.45, Ramapuram (Vill) Mellacheruvu (Mandal), Suryapet (Dist) have changed my name from Thatikonda Srinivasa Reddy to THATIKONDA SRINIVAS REDDY for all future purpose.

NAME & SURNAME CHANGE AND POLICY BOND MISPLACED
I, KANDIKATLA YASAIAH Als Katam Yasaiah Als. YESU, S/o. Mattaiah, Adavidevulapally, Nalgonda Dist. I submit that my policy No.603780325 in that policy my name recorded as KANDIKATLA YASIAH in my Bank A/c my name recorded as KATAM YESU, I am adapted my own Father KATAM SOMAIAH to KANDIKATLA MATTAIAH so both surname and names my only my policy bond also misplaced in my house.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపులే: 9182777638

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట రూరల్, జనవరి 31: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉంటుంది.. ఏమేమి వడ్డిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ విధంగా చదవాలి, పరీక్షలు ఎలా రాయాలనే విషయాలపై పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న కెరియర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని, విద్యార్థుల్లోని భయాన్ని తొలగించాలని, ఒత్తిడిని గుర్తించి పరిష్కరించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్ధన్, ప్రిన్సిపాల్ రమేశ్, రిసోర్స్ పర్సన్ మారం పవిత్ర, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, జాఫర్, రమేశ్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి : ఆర్టీఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీఓ సురేశ్‌రెడ్డి

నేరేడుచర్ల, జనవరి 31: రెప్పపాటు కాలంలోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆర్టీఓ సురేశ్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నేరేడుచర్లలోని శ్రీవాణి స్కూల్‌లో కరస్పాండెంట్ కొనతం సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పక ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలలో 80 శాతం తలకు గాయాలై మరణిస్తున్నారని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు జయప్రకాశ్‌రెడ్డి, ఆదిత్య, రాజ్‌మహ్మద్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్‌కుమార్, సతీశ్‌కుమార్, చరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి పైర్లను పరిశీలించిన వ్యవసాయాధికారులు

కోదాడ రూరల్: పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ఎల్లయ్య, అధికారులు

కోదాడ రూరల్, జనవరి 31: మండలంలోని రెడ్లకుంట, కూచిపూడి గ్రామాల్లో వరి పొలాల్లో పైరు ఎదగకముందే పిలకలు వస్తున్నాయని రైతుల ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఏడీఏ ఎల్లయ్య, గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పాలెం రజని, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలను పాటించాలి

పెన్‌పహాడ్: రైతులు వరి పంట దిగుబడిపై ఎటువంటి అపోహలకు గురికాకుండా వ్యవసాయాధికారుల సలహాలను పాటించాలని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన రైతు గజ్జి వెంకన్న ఓ ప్రైవేట్ షాపులో వరి విత్తనాలను తీసుకొచ్చి సాగు చేపట్టానని, డిసెంబర్ మొదటి వారంలో నాటు పెట్టగా అప్పుడే పొలం ఈనికంకులు వస్తున్నాయని ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఏఓ అనిల్‌కుమార్ ఆ పొలాన్ని పరిశీలించారు. అధిక దిగుబడికి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, అన్నారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

'ఏఐఎస్ఎఫ్ సమావేశాలను జయప్రదం చేయాలి'

సూర్యాపేట టౌన్, జనవరి 31: హైదరాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గోపగాని రవికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్‌లో సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ జరుగుతూ విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్, నవీన్, మహేశ్, రాజు, వినయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

'వాహనదారులు శబ్ద కాలుష్యం సృష్టించొద్దు'

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కోదాడ రూరల్, జనవరి 31: వాహనదారులు శబ్ద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని కోదాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జిలాని అన్నారు. వాహన హారన్ల వినియోగంపై శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా పెద్ద పెద్ద శబ్దాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

మఠంపల్లి: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ వెంకటాచారి, ఉపాధ్యాయులు

మఠంపల్లి, జనవరి 31: మండల కేంద్రంలో శుక్రవారం మండల ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మఠంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థి అప్రోజ్ ప్రథమ స్థానంలో నిలవగా, కావ్య, శివానీలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల విద్యాధికారి వెంకటాచారి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుడిగ వీరబాబు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నేరేడుచర్ల: స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎస్.గీతిక ప్రథమ స్థానంలో నిలవగా, దిర్శించర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని డి.ప్రణవి, జ్యోతిబా పూలే విద్యాలయ విద్యార్థి రాకేశ్ తరువాతి స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి, నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మధుబహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల జీఎంలు దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులు 250 మందికి స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఎంఈఓ రవి చేతులమీదుగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులు హరిత్, దివ్య, లిఖితకు బహుమతులను అందజేశారు.

అర్వపల్లి: మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ని అర్వపల్లిలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ బాలునాయక్ ప్రారంభించారు. అర్వపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు సింధు, శ్రావ్య మొదటి రెండు స్థానాల్లో నిలువగా, పర్సాయపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన అఖిల్ మూడో స్థానంలో నిలిచాడు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

తిరుమలగిరి, జనవరి 31: తిరుమలగిరి మున్సిపాలిటీ కొత్త కమిషనర్‌గా బి.యాదగిరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మణుగూరు మున్సిపాలిటీ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

మోతె తాసీల్దార్‌గా శ్రీకాంత్

మోతె, జనవరి 31: మోతె తాసీల్దార్‌గా శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధ్యాయుడికి తెలుగు సాహిత్య కళాపీఠం ఆహ్వానం

తుంగతుర్తి, జనవరి 31: మండలంలోని వెలుగుపల్లి జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు షీలా అవిలేనుకు న్యూఢిల్లీలో జరిగే తెలుగు సాహిత్య సాంస్కృతిక కదంబం కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం తెలుగు సాహిత్య కళాపీఠం ద్వారా ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 7 నుంచి 10 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆయన కవితాగానం చేయనున్నారు.

నూతన భవనంలోకి కేజీబీవీ విద్యార్థినులు

నాగారం, జనవరి 31: నాగారం కేజీబీవీ విద్యార్థినులను అర్వపల్లి నుంచి వర్ధమానుకోటలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనంలోకి తరలించినట్లు తాసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇంతకుముందు పక్కా భవనం లేకపోవడంతో కేజీబీవీని అర్వపల్లిలోని అద్దె భవనంలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో నిర్మించిన నూతన భవనంలోకి విద్యార్థినులను తరలించినట్లు చెప్పారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు.

యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా సైదులు

సూర్యాపేట, జనవరి 31: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మార్యాద సైదులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా తూము వెంకన్న యాదవ్‌ను నియమిస్తూ శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్‌యాదవ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలో యాదవుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

'పాలకవీడులో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి'

పాలకవీడు, జనవరి 31: మండల కేంద్రం పాలకవీడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ యరెడ్ల సత్యనారాయణరెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాయకులు మంద నాగయ్య, జాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన

మేళ్లచెర్వు, జనవరి 31: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకల వల్ల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హత ఉండి కూడా తమకు లబ్ధి చేకూరలేదని శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పలువురు ఎస్సీ కుటుంబాల వారు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గతేడాది ఉపాధి పనులు చేసినా మస్టర్లు మార్చి రాయడం వల్ల తమకు అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి : అదనపు కలెక్టర్

నేరేడుచర్ల: సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నేరేడుచర్ల, జనవరి 31: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం వార్డు అధికారులు, మెప్మా సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను వసూళ్లు, ఎల్ఆర్ఎస్, పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు.మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

హుజూర్‌నగర్: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి, నీటి తదితర పన్నులను 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మొత్తం ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ వినోద్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, జేఏఓ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ అధికారి అశోక్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి'

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 31: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రైవేట్ హాస్పిటల్స్ మెడికల్ మాఫియాను అరికట్టాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డీఎంహెచ్ఓ కోటాచలంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. నూటికి 80 శాతం మందులు హాస్పిటల్‌లో కాకుండా బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, ఆయా సంఘాల నాయకులు రేణుక, సంతోషిమాత, జయమ్మ, పద్మ, లక్ష్మి, పావని, సయ్యద్, రేష్మ, శ్యామల, వీరబాబు, సైదులు, శ్రీదేవి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి'

ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కోదాడ టౌన్, జనవరి 31: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం నాయకులతో కలిసి కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకుండా, మండలంలో ఒకే గ్రామానికి అమలు చేయడం సరికాదన్నారు. అదేవిధంగా వానకాలంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి నేటికీ కొందరు బోనస్ రాని రైతులు ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య, బత్తినేని హనుమంతరావు, శ్రీనివాసరావు, ఏలూరి నాగయ్య, సామినేని సుబ్బారావు, కనగాల కొండయ్య, అలవాల గురవయ్య, తూమాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాంబాబు

చిలుకూరు, జనవరి 31: విద్యార్థులు